# ఆరాధన

■ కలువకొలను సదానంద

రోజుకో రకం చీరగట్టే చందమామ పేరు - సరోజ.

ప్రతి రోజూ ఆపీసుకి ఓ అయిదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే ఆ కుందనపు బొమ్మ- ఈ రోజు ఆశ్చర్యకరంగా ఓ అయిదు నిమిషాలు ముందే వచ్చేసింది. సౌందర్యాధి దేవతలా నడిచివెళ్ళి తన సీటును అలంకరించింది.

తన ఎట్టయెదుటి సీటు వైపు దృష్టి సారించింది సరోజ. ఆ సీటు ఖాళీగానే ఉంది.

సరోజ తన చీర వైపు, బ్లౌజు వైపు చూసుకొంది. ఈ రోజు కోసమని ప్రత్యేకంగా కట్టుకొన్న చీర ఇది. తాను ప్రతి రోజూ కట్టుకునే ప్రతి చీరా అందమైనదే. ఈ రోజు కట్టుకున్న చీర మరింత అతిశయమైనది.

తాను ఈ ఉద్యోగం చేస్తున్నది కేవలం కాలక్షేపం కోసమే. తన భర్త మంచి ఆర్థిక స్తోమత ఉన్నవాడు. 'నీ జీతం డబ్బులేవీ' అని ఏనాడూ చేయి చాచి ఎరుగడు. మంచి భర్త. చీరలు తెమ్మని, సౌందర్య సాధనాలు తెమ్మనీ తాను అడుగదు. అతని పాలిటికి తాను మంచి భార్య. ఇలా భార్యాభర్తలిద్దరూ మంచి వాళ్ళయి ఉండడం ఎంతో అరుదు.

ఎదుటి సీటు వైపు మళ్ళీ చూసింది సరోజ. ఆ కుర్చీ ఖాళీగానే ఉంది. ఇది చాలా అన్యాయం. దేవత కోసం భక్తుడు ఎదురు చూడడం న్యాయం. ఈ న్యాయం తారుమారు కావడం చిత్రంగానే ఉంది.

బావ దగ్గర-అదే, తన భర్త దగ్గర తాను ఏదీ దాచదు. ఇదీ కూడా దాచలేదు.

"బావా! నీకో సంగతి చెప్పనా" అంది ఇటీవల ఓ రోజు.

"ఏమిటీ?"

"ఒక భక్తాగ్రేసరుడు నన్ను ఏకాగ్ర చిత్తంతో ఆరాధిస్తున్నాడు."

"ఎవడా దీనుడు" అని అడిగాడు బావ.

"మా ఆఫీసులోనే ఓ గుమాస్తా. పేరు గోపాల కృష్ణమూర్తి. నా ఎదురుగానే కూర్చుని నన్ను ఒలుచుకు తినేటట్లు చూస్తుంటాడు."

...చిరు నవ్వుని మునిపంట కరచిపట్టి బావ ముఖంలోకి చూసింది తాను.

బావకు చీమ కుట్టినట్లయినా లేదు.

"అలాగా" అన్నాడు చల్లగా.

"మరేమనుకున్నావు? మనిషి ఎలా ఉంటాడో తెలుసా? కాకి గూడు తలకాయనుకో. పిచ్చిక గూడు గడ్డమనుకో. చక్కిలి గింతలు పెట్టినా, నవ్వు కనిపించదు గోపాలకృష్ణమూర్తి ముఖంలో. అతన్ని చూడలని ఉంటే చెప్పు- ఎప్పుడైనా మనింటికి ఆహ్వానిస్తాను."

"ఎందుకే, అతడితో చెలగాటమాడతావు, పాపం" అన్నాడు బావ.

'ప్చ్! రాను రాను బావలో సరసం తగ్గిపోతోంది' అనుకుంటూ తనలో తానే నవ్వుకుంది సరోజ.

...ఎదుట ఉన్న సీటే గోపాలకృష్ణమూర్తిది.

సంవత్సరం క్రితం ఇక్కడ తాను ఉద్యోగంలో చేరింది. నెల తిరక్కముందే, గోపాలం పనిగట్టుకుని తన వైపు చూస్తున్నాడన్న సంగతి కనిపెట్టింది.

కొన్నాళ్ళు పోయాక, మరో విచిత్ర చేష్టను కూడా గమనించింది.

గోపాలం తనవైపు చూసేవాడు. చిన్న కాగితం ముక్క తీసుకుని అందులో ఏదో రాసేవాడు. దానిమీద పేపర్ వెయిట్ ఉంచి, తన పనిలో లీనమయ్యేవాడు. అప్పుడప్పుడూ ఆ కాగితంలోకి చూసేవాడు.

ఆ కాగితంలో ఏముంది?

'అయ్యా గోపాలకృష్ణమూర్తీ! నన్ను చూసి ఆ కాగితంలో ఏం రాశావు' అని ఎలా అడుగుతుంది తాను? అడిగిందే చాలనుకుని ఆ ప్రణయ లేఖనో, ప్రళయ లేఖనో అమాంతం తన చేతుల్లో కుక్కి, పళ్ళికిలించేస్తే తానేం కావాలి? మొత్తానికి కొరకరాని కొయ్యే అయి కూర్చున్నాడు ఈ గోపాలకృష్ణమూర్తి.

ఎలాగైతేనేం, ఒక రోజు ఆ ఇంద్రజాలాన్ని ఛేదించగలిగింది తాను. లంచ్ టైమ్‌లో- ఎవరూ లేని సమయం చూసి అతని బల్లమీద కాగితం ముక్కను హస్తగతం చేసేసుకుంది.

అందులో ఏముంది? తన గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఏమంటాడు గోపాలకృష్ణుడు? సఖియా- అంటాడా? చెలియా- అంటాడా? ఏమీ అనలేదు. 'కోవెల లాంటి శరీరంలో దీపం లాంటి ఆరోగ్యం! వెన్నెల లాంటి అందానికి ఆకాశం లాంటి చీర' అని రాసుకున్నాడు.

తనకు సిగ్గువేసింది. గోపాలం తన శరీరాన్ని వర్ణించాడు. తన అందాన్ని వర్ణించాడు. తన చీరను వర్ణించాడు. ఆ రోజు నీలం రంగు చీర కట్టుకొంది తాను.

ఆ రోజు నుంచి వీలు చిక్కినప్పుడల్లా ఆ కాగితాలను సేకరించింది. అన్నీ తన ఉడుపులను గురించిన వివరాలే. వాటిలో మచ్చుకొకటి: 'పన్నె బంగారం లాంటి ఒంటికి చాక్లెట్ రంగు షిఫాన్ చీర! చాలా బాగుంది. ధర ఎంతో? ఒక బలవంతుడు ఏనుగు మీద నిలబడి రత్నాన్ని పైకి విసిరితే అది ఎంత పైకి పోతుందో అంత ఎత్తు ధర కాబోలు!'

చివరి కాగితం రెండు వారాల కిందటిది. 'గ్రిగేరియన్ పద్ధతి మేరకు సంవత్సరానికి చీరలు మూడు వందలా అరవై అయిదు; లీపు సంవత్సరానికి మూడువందలా అరవై ఆరు!'

ఆ రోజు అతని మీద కోపం మొలకెత్తి మహా వృక్షమై ఊడలు దిగేసరికి రాత్రి పన్నెండు గంటలయింది.

'అయ్యా గోపాలం! నీకింకేమీ పని లేదా? పరస్త్రీలను చిత్తం వచ్చినట్లు వర్ణిస్తూ కూర్చుంటే ఊరుకుంటారనుకున్నావా? నీకు అక్కచెల్లెళ్ళు లేరా? నిన్ను ఆడది కనలేదా? ఎవతె ఏ చీర కట్టుకుంటే నీకెందుకు? నా కెన్ని చీరలున్నాయో నా మొగుడే లెక్కపెట్టలేకపోయాడు, నీకెందుకొచ్చిన దురద? ఉండు, నీ పని రేపు చెబుతాను' అనుకుంటూ నిద్రపోయింది.

మరునాడు గోపాలం ఆఫీసుకు రాలేదు. రెండు వారాలు సెలవు పెట్టాడని తెలిసింది.

ఆ రెండు వారాలూ గడిచిపోయాయి. ఎందుకు సెలవు పెట్టాడు గోపాలం? రెండు వారాలూ ఎలా గడిపాడు? ఎవరిని చూస్తూ కూర్చున్నాడు?...

తనకు మాత్రం పదిహేను రోజులు దొర్లేసరికి పదిహేను వారాలు గడిచినట్టుగా ఉంది.

ఈ రోజు గోపాలం వస్తాడు. అతన్ని దుయ్యబట్టాలన్న ఆగ్రహం కొండెక్కిపోయింది. ఆకాశమంత బీరువా లోంచి ఈ చీరను ఎంపిక చేసి కట్టుకొంది. అయిదు నిమిషాలు ముందుగానే ఆఫీసులో వాలింది.

మేనేజర్ ఎవరినో మందలిస్తున్నాడు. గోపాలం వచ్చాడన్నమాట. హమ్మయ్య. ఎన్నాళ్ళకొచ్చావయ్యా గోపాలకృష్ణయ్యా!

వంచిన తల పైకెత్తకుండా తన సీటు వద్దకు నడిచాడతను.

కాలానికి రెక్కలొచ్చాయి.

అయితే, సరోజకు ఆశాభంగమైంది. నిరుత్సాహం కమ్ముకొంది. గోపాలం ఒక్కసారి కూడా తల పైకెత్తలేదు.

లంచ్ టైమ్‌లో అతని బల్ల మీద చూసింది సరోజ. ఇదివరకటిలా ఏ కాగితమూ లేదక్కడ.

అయిదు గంటలయిందో లేదో ఆఫీసు ఖాళీ అయిపోయింది. తాను కూడా లేవబోయింది సరోజ. గోపాలం కుర్చీలోంచి ఇంకా కదలకపోవడం చూసి తానూ అలాగే ఉండిపోయింది.

గోపాలాన్ని ఒక మాట అడగాలని ఉంది. 'నావైపు ఎందుకలా చూస్తావు' అని కాదు, 'ఈరోజు ఎందుకు కన్నెత్తి చూడలేదు' అని.

సరోజ పైకి లేచింది. అతని మేజా ముందర నిలబడింది. "గోపాలంగారూ" అంది.

అతడు తల పైకెత్తాడు. వాన ముసురులో దాగిన సూర్యబింబం లాంటి కళ్ళు. కాంతి ఏమాత్రమూ లేని మసక చూపులు.

ఆమె తన హ్యాండ్ బ్యాగ్ తెరిచింది. అందులోంచి రెండు కాగితం ముక్కల్ని బయటికి తీసి అతడి ముందర పెట్టింది. అప్పుడెప్పుడో తన చీరల్ని వ్యాఖ్యానిస్తూ అతడు రాసుకున్న రాతలవి.

అతడు ఆ కాగితాల్లోకి చూశాడు. ఆమె కళ్ళలోకి చూశాడు. కళ్ళు వాల్చేశాడు.

"ఏమిటిది" అంది సరోజ హుందాగా.

అతడు నీళ్ళు నమిలాడు. "సారీ... నా ఉద్దేశం... నాకు దురుద్దేశమేమీ లేదండీ!..."

"అద్సరే, ఈరోజు ఏ కామెంటూ రాయలేదు ఎందుకని? అసలు నన్ను కన్నెత్తి చూడలేదు. ఏమైంది మీకు" అంది ఆమె.

గోపాలం తల పైకెత్తి ఆమె కళ్ళలోకి చూశాడు. చిరునవ్వు నవ్వాడు. చెమర్చిన కళ్ళను తుడుచుకున్నాడు.

"ఇక్కడికి దగ్గరే మా ఇల్లు. మీకు అభ్యంతరం లేకపోతే మా ఇంటికొచ్చారంటే- అబ్బే, రెండు నిమిషాలే- అక్కడ చెబుతాను మీకు సమాధానం."

ఆమె ఔననలేదు, కాదనలేదు. మౌనంగా అతణ్ణి అనుసరించింది. ఒక సన్నటి ఇరుకు వీధిలోకి దారి తీశాడు గోపాలం. ఇరుకుటిండ్లు, పెంటకుప్పలు, కంపు కాలువలు, అపరిశుభ్రత, రొంపి, రోతా...

"అబ్బ! ఇక్కడ మనుషులెలా ఉండగలరు" అంటూ బుగ్గ నొక్కుకుంది సరోజ.



చిత్రం: నర్సిం

"ఉండలేరు. మనుషులు ఉండలేరు! ఉండగలుగు తున్నవాళ్ళు మనుషులు కారు" అన్నాడతడు.

సందుగొందుల వెంబడి నడిచి, ఓ పాత పెంకు టింటి ముందర ఆగాడు గోపాలం. ఒక ఎనిమిదేళ్ళ పిల్ల గుమ్మం దగ్గర కూర్చుని సుద్ద ముక్కతో నేలమీద ఏదో గీసుకుంటోంది. ఆరేళ్ళ కుర్రా డొకడు గడపలో కూర్చొని కాగితాలు చింపి పోగు పెడుతున్నాడు.

"లోపలికి రండి" అన్నాడు గోపాలం.

సరోజ లోపలికి నడిచింది.

రెండు గదుల చిన్న ఇల్లు అది. ఆ ఇంటిలో విసురుగా నాలుగడులు నడిస్తే ముఖం గోడకు గుద్దుకుంటుంది.

వంట గదిలో ఒక ముసలామె పొగలో ఉక్కిరి బిక్కిరైపోతోంది. ఆమె వీపు మీద వాలిన మూడేళ్ళ కుర్రాడొకడు చెంగున గెంతి, "నానొచ్చారు, నానొచ్చారు" అంటూ పరుగెత్తుకొచ్చాడు. గోపాలం కాళ్ళకు చుట్టుకుపోయి, "నానోయ్! నానమ్మ గోచీ పెట్టింది. బాందా" అన్నాడు.

"చాలా బాగుంది" అన్నాడు గోపాలం.

అందాకా నేల మీద గీతలు గీసుకుంటున్న పిల్ల లేచి నిల్చుంది. "నాన్నా! ఇంటివాడొచ్చి..."

"కేకలేసిపోయాడా?"

**గోపాలం తనవైపు చూసేవాడు. చిన్న కాగితం ముక్క తీసుకుని ఏదో రాసేవాడు. అప్పుడప్పుడూ ఆ కాగితంలోకి చూసేవాడు. ఆ కాగితంలో ఏముంది?**

"ఊఁ!"

"నిలబడ్డారేమండీ, కూర్చోండి" అంటూ స్టూలు లాగాడు గోపాలం.

"వీళ్ళు మీ పిల్లలేనా" అంటూ స్టూలు మీద కూర్చుంది సరోజ.

"నీ పేరేమిటమ్మా" అని అడిగింది పెద్ద పిల్లను.

"రత్నమాల."

"నీ పేరు బాబూ" అని అడిగింది రెండో వాణ్ణి.

"మాణిక్యం."

అడక్కుండానే తన పేరు చెప్పాడు గోచి పాతరాయుడు, "నా పేలు ఏమాదిలి."

"ఏమాదిరా!"

"అంటే హేమాద్రి అన్నమాట" అంది రత్నమాల.

హేమాద్రి అంటే బంగారు కొండ కదూ? రత్నమాల, మాణిక్యం, బంగారు కొండ... మంచి పేర్లే అనుకుంది సరోజ.

ఆ గది అంతా కలయజూసింది ఆమె. దండెం మీద రెండు మూడు చింకి చీరలు వేలాడుతున్నాయి. గూటి నిండా ఖాళీ సీసాలున్నాయి. గోడ మీద ఒక ఫోటో ఉంది.

సరోజ లేచి ఆ ఫోటో వద్దకు నడిచింది. అందులో ఇద్దరున్నారు. ఒకరు, గోపాలం. గోపాలం అందంగా ఉన్నాడు. పొగరెక్కిన కోడిపుంజులా ఉన్నాడు. అతని పక్కన ఉన్న యువతి కళ్ళు సిగ్గుతో బరువుగా ఉన్నాయి. ఆమెను కన్నార్పకుండా చూడసాగింది సరోజ.

"ఎవరీమె? మీ ఆవిడా?"

"ఔనండీ."

"చాలా బాగుంది."

"ఔను. చాలా బాగుంది" అన్నాడు గోపాలం.

సరోజ విడ్డూరంగా అతనివైపు చూసింది.

అతని పెదవులు వణకుతున్నాయి. చూపులు శూన్యంలో ఉన్నాయి.

"పెళ్ళయిన కొత్తలో తీయించుకున్న ఫోటో అండీ అది. ఇలా చూడండి, ఈ దండెం మీదున్న చింకి చీరలు ఆమెవే. ఆ గూటిలో ఖాళీ సీసాలు చూశారా? వాటిలో ఉన్న మందులన్నీ ఆమె వాడేసింది. ...సరోజగారూ! నేనొక దేవతను పూజిస్తున్నాను. నా గుండెలో ఆమెకు పీట వేస్తాను. నా అనురాగంతో ఆమెను అభిషేకిస్తాను. నేను చేయగలిగింది అంతే! నా దేవతకు అలంకారాలు లేవు. ఆమె కంటిలో వెలుగు లేదు. తేరులో ఊరేగే దివ్య మంగళవిగ్రహాన్ని చూస్తే నాకేమనిపిస్తుందో తెలుసా? నేను కొలిచే విగ్రహంలో ఆ కాంతులన్నీ ఉండాలనిపిస్తుంది. ఆ అలంకారాలన్నీ కావాలనిపిస్తుంది. ఈ దృష్టితో ఉత్సవ విగ్రహాన్ని చూడటం తప్పా?..." అతని గొంతు బొంగురుపోయింది.

సరోజ ప్రతిమలా నిలబడిపోయింది. గోపాలం భార్య కోసం ఆమె కళ్ళు వెతుకుతున్నాయి. 'ఆమె ఎక్కడ' అని అవి గోపాలాన్ని అడుగుతున్నాయి.

గోడకు ఆనుకుని నిలబడ్డ గోపాలం నేల మీదికి జారాడు.

"ప్రపంచంలో అందాలకు నా దృష్టిలో విలువ పోయింది. వాటివైపు తేరి చూడాల్సిన అవసరం కూడా దాటిపోయింది. రెండు వారాల కిందట హాస్పిటల్లో కన్ను మూసింది నా దేవేరి. ఆమె చింకి చీరతోనే... చింకి... చీరతోనే వెళ్ళిపోయింది సరోజమ్మా!"

సరోజ అనిమిషురాలైంది.

వెచ్చటి కన్నీటి బొట్లు రెండు కుందనపు బొమ్మ కనుకొలకుల్లో ముత్యాలై నిలిచాయి. ■